సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 2 । జూలై । 2024



వినికిడి మిషన్ అందజేత

సిరిసిల్లటౌన్: వినికిడి సమస్యతో బాధపడుతు న్న సుభాష్‌నగర్‌కు చెందిన బూర రవీందర్‌కు కలెక్టర్ ఆదేశాలతో డీడబ్ల్యూవో లక్ష్మీరాజం వినికిడి మిషిన్ అందించారు.

రేపు జెడ్పీ ప్రత్యేక సర్వసభ్య సమావేశం

సిరిసిల్ల: జిల్లా ప్రజావరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం 3న నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈవో ఉమారాణి సోమవారం తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు, జిల్లా అధికారులు హాజరుకావాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
32.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఈవోగా బాధ్యతలు స్వీకరించిన వినోద్‌రెడ్డి



వేములవాడ: రాజన్న ఆలయ ఈవోగా కొప్పుల వినోద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఏఈవో హరికిషన్, ప్రతాప నవీన్ స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సిబ్బంది సహకారంతో కృషి చేస్తానన్నారు.

ముదిరాజ్ యూత్ జిల్లా అధ్యక్షుడిగా ప్రశాంత్



తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలానికి చెందిన బల్లెపు ప్రశాంత్ తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా యూత్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ప్రశాంత్‌ను రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర యూత్ అధ్యక్షుడు పండుగ బాలుముదిరాజ్ నియమించగా.. రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డాక్టర్ బండ ప్రకాశ్‌ముదిరాజ్ నియామకపత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు, జిల్లా అధ్యక్షుడు కోడి అంతయ్యకు ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీవెన్స్‌డేకు 21 ఫిర్యాదులు



సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు 21 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలుండాలని ఆదేశించారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

సిరిసిల్లక్రైం: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. చిన్నపిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలకార్మికుల కనిపిస్తే 1098, డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వరదముప్పు తప్పేనా?

- చిన్నబోనాల పెద్దచెరువు గండి పూడ్చివేత
- గతేడాది గండితో నిండా మునిగిన సిరిసిల్ల
- అసంపూర్తిగానే సిరిసిల్లలోని వరద మళ్లింపు పనులు
- ఇప్పటికీ చినుకు పడితే భయాందోళనే..



ఇది సిరిసిల్ల శివారులోని చిన్నబోనాల పెద్ద చెరువుకు గతేడాది జూలై 27న పడిన గండి. ఈ చెరువులోని నీరంతా సిరిసిల్లలోని వెంకంపేట, అనంత్‌నగర్, ప్రగతినగర్, సర్దార్‌నగర్, సంజీవయ్యనగర్, శాంతినగర్‌లను ముంచేశాయి. చెరువుకు గండి పడడంతో పంటపొలాలు కోతకు గురయ్యాయి. పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. పోలీసుల సాయంతో నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. తొలిసారి గాంధీచౌక్ వరకు వరదనీరు చేరింది.



ఇది చిన్నబోనాల పెద్దచెరువుకు పడిని గండిని మట్టితో పూడ్చి రాతికట్టడంతో మరమ్మతులు చేశారు. నీటిపారుదల శాఖ ద్వారా రూ.18లక్షలు వెచ్చించగా.. మున్సిపల్ ద్వారా రూ.17లక్షలు వెచ్చించారు. చిన్నబోనాల శివారులో వర్షాలు ఎక్కువగా కురిసినా.. చెరువులోకి వరద నీరు ఎక్కువగా చేరినా.. ఎప్పటికప్పుడు చెరువులోని నీరు వెళ్లిపోయేందుకు వీలుగా మత్తడిని నిర్మించారు.

సిరిసిల్ల: చిరుజల్లులకే సిరిసిల్ల చెరువైతుంది. పాత బస్టాండ్ ఏరియా, సంజీవయ్యనగర్ ప్రాంతాల్లో వరదనీరు, డ్రెయినేజీ మురికినీరు కలిసి రోడ్డెక్కుతున్నాయి. ఇప్పటికే సిరిసిల్ల జిల్లా కేంద్రం మూడు సార్లు జలమయమైంది. అయినా వరద మళ్లింపు పనులు పూర్తిచేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఏటా వర్షాకాలంలో సిరిసిల్లను ముంపు భయం వీడడం లేదు. గతేడాది గండిపడినా చిన్నబోనాల పెద్దచెరువుకు అధికారులు ఇటీవల మరమ్మతు చేశారు. అయితే పట్టణంలో వరదమళ్లింపు పనుల గురించి పట్టించుకోలేదు. ఇప్పటికీ సిరిసిల్లను ముంపు భయం వెంటాడుతూనే ఉంది.



సిరిసిల్లలో ఇంట్లోకి చేరిన వరదనీరు(ఫైల్)

చెరువులు మాయం.. కాలనీలు ప్రత్యక్షం

సిరిసిల్లలోని రాయినిచెరువును పూర్తిగా పూడ్చివేసి బీవై నగర్, గణేశ్‌నగర్, సుందరయ్యనగర్, తారకరామానగర్, ఇందిరానగర్ కాలనీలుగా అవతరించాయి. ప్రస్తుతం కొత్తచెరువును సుందరీకరణ పేరుతో శిఖం ప్రాంతాన్ని పూడ్చివేసి ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. దీంతో కొత్త చెరువునీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. సిరిసిల్ల పట్టణం నడిబొడ్డులోని ఉదారువాగు కబ్జాకు గురైంది. ఇలా పాలకుల నిర్లక్ష్యంతో పట్టణంలో వరద సమస్య తీవ్రమైంది. మరోవైపు మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ ఇంజినీరింగ్ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఎవరికి వారు పనులు చేసుకుంటూ వెళ్లడంతో వరదనీటిని అడ్డుకునే ప్రణాళికలు లేకుండా పోయాయి.

ఇవీ చేస్తేనే సమస్యకు పరిష్కారం

- కొత్త చెరువు మత్తడి దూకితే వచ్చే వరదనీరు శ్రీనగర్‌కాలనీని ముంచెత్తకుండా కచ్చా కాల్వను బైపాస్‌రోడ్డు వరకు కొనసాగించాలి. అప్పుడు వరద తుమ్మలకుంటలోకి వెళ్తుంది.
- రాజీవ్‌నగర్, ముష్టిపల్లి నుంచి వచ్చే వరదనీటిని కొత్త చెరువులోకి నేరుగా చేరేలా రూ.6.21కోట్లతో చేపట్టిన పనులు పూర్తిచేయాలి. ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేస్తేనే సిరిసిల్లలోకి వెళ్లకుండా చెరువుకు వరద నీరు చేరుతుంది.
- మురికినీటి శుద్ధి కోసం వెంకంపేట–అనంత్‌నగర్ మధ్య కాల్వపై నిర్మించిన ఈటీపీ ప్లాంటును పూర్తిగా తొలగించి నేరుగా నీరు వెళ్లేలా పనులు చేయాల్సి ఉంది.
- సాయినగర్ నుంచి శాంతినగర్ వరకు ఉన్న ప్రధాన మురికికాల్వలో పేరుకున్న పూడికను తొలగించాలి.

చెరువు గండి పూడ్చారు



చిన్నబోనాల పెద్దచెరువు గండి పూడ్చివేత ఇటీవల పూర్తయింది. వర్షాలు బాగా పడితేనే చెరువు నిండుతుంది. ఇప్పుడు చెరువులో పెద్దగా నీరులేదు. బాగా వానలు కొడితే చెరువులోకి నీరు వస్తుంది. ఈ చెరువు గండి పూడ్చి, మత్తడిని నిర్మించారు. ఇక సిరిసిల్ల పట్టణానికి పెద్ద చెరువు నుంచి వరద ముంపు తప్పినట్లు అయింది.

– బొల్గం నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్

వేములవాడ ఏఎస్పీగా శేషాద్రినిరెడ్డి



సిరిసిల్లక్రైం: వేములవాడలో డీఎస్పీ కార్యాలయానికి ఏఎస్పీగా శేషాద్రినిరెడ్డిని నియమిస్తూ సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. 2021 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఈ అధికారి గ్రేహౌండ్స్‌లో అసల్ట్ కమాండర్‌గా విధులు నిర్వహించి వేములవాడ డీఎస్పీ కార్యాలయానికి కేటాయించారు. ఇప్పటి వరకు డీఎస్పీగా విధులు నిర్వహించిన నాగేంద్రచారిపై బదిలీవేటు పడింది. వేములవాడ సబ్‌డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన మర్డర్లు, ఇతరత్ర అసాంఘిక కార్యకలాపాలు పెరిగిన నేపథ్యంలో ఐపీఎస్ అధికారికి విధులు కేటాయించారా.. అనే చర్చ సాగుతోంది.

సత్య నాదెళ్లను కలిసిన జిల్లా యువకుడు



సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన యువకుడికి అరుదైన అవకాశం లభించింది. మైక్రోసాఫ్ట్ అధినేత సత్యనాదెళ్లను కలిశారు. అనంతనగర్‌కు చెందిన చిందం రమేశ్ అమెరికాలో ఫైన్‌ఆర్ట్స్ కళాకారుడిగా స్థిరపడ్డారు. అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. రమేశ్ సోమవారం మైక్రోసాఫ్ట్ అధినేత సత్యనాదెళ్లను కలిసిన విషయాన్ని సోషల్‌మీడియా వేదికగా పంచుకున్నారు.

అర్హులకే రైతుభరోసా

- మహాసభల్లో అభిప్రాయాల సేకరణ
- జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

చందుర్తి(వేములవాడ): అర్హులకు రైతుభరోసా అందించేందుకే అభిప్రాయ సేకరణకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ పేర్కొన్నారు. చందుర్తి, సనుగుల సింగిల్‌విండో పరిధిలో సోమవారం రైతులతో మాట్లాడారు. పది ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు ఇవ్వాలని, పంటలు సాగుచేసే వారికే ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు, ఇన్‌కమ్ టాక్స్ చెల్లించే వారికి ఇవ్వవద్దని అభిప్రాయపడ్డారు. గతంలో మాదిరిగా ప్రభుత్వం సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు అందించాలని కోరారు. చందుర్తి మండల వ్యాప్తంగా 600 ఎరాలకు సాగుచేయని భూమికి రైతుబంధు పొందినట్లు గుర్తించామని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ తెలిపారు. నిబంధనల మేరకు పథకాలు అమలవుతాయని వివరించారు. చందుర్తి, సనుగుల సింగిల్‌విండో చైర్మన్‌లు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్‌రావు, చందుర్తి వ్యవసాయాధికారి దుర్గారాజు, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

సిరిసిల్ల: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ జిల్లాలో మంగళవారం పర్యటించనున్నారు. రామగుండం నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి సిరిసిల్లకు ఉదయం 11 గంటలకు చేరుకుంటారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్‌లతో సమీక్షిస్తారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



సిరిసిల్లకల్చరల్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మినీస్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్ 8, 10, 12 విభాగాల్లో జిల్లా నలుమూలల నుంచి బాలబాలికలు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు, జిల్లా క్రీడల అధికారి అజ్మీర రాందాస్, జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం మెడల్స్ అందజేశారు. ప్రతిభ చూపిన 15 మంది బాలబాలికలను ఈనెల 7వ తేదీ హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్‌కుమార్, దివ్య అశోక్, శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

వరదముంపును తప్పించండి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: సిరిసిల్లలో వరదముంపు రాకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని, గత అనుభవాలతో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. స్థానిక పద్మనగర్, శ్రీనగర్‌కాలనీ, శాంతినగర్, బైపాస్‌రోడ్డు వరద కాల్వప్రాంతాలను సోమవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు, వరదనీటితో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాలాల్లో పూడికతొలగించాలని, మురికినీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య, డీఈఈ ప్రసాద్, ఏఈ స్వామి, టెక్నికల్ ఆఫీసర్ వెంకటేశ్, టీపీఎస్‌లు వినయ్, నవీన్ పాల్గొన్నారు.

గోశాల కోడెలు, ఆవుల పంపిణీ

వేములవాడ గోశాల నుంచి అదనపు కోడెలు, ఆవుల ఉచిత పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆలయ, రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ అధికారులతో సమీక్షించారు. కోడెలు, ఆవులను అర్హులైన రైతులకు, గోశాలలకు పంపిణీ చేయాలన్నారు. దరఖాస్తులు ఆహ్వానించి, కమిటీ నిర్ణయాలతో పంపిణీ చేయాలని తెలిపారు. వేములవాడ దేవస్థానానికి ఏటా దాదాపు 2500 కోడెలు భక్తుల సమర్పిస్తారని, ఆలయం వద్ద 450 నుంచి 500 వరకు కోడెలకు వసతి ఉందన్నారు. తిప్పాపురం గోశాలలో అదనపు షెడ్డుల నిర్మాణం, సీసీ ఫ్లోరింగ్, డ్రెయినేజీ నిర్మాణానికి దేవాదాయ శాఖ రూ.కోటి మంజూరుచేసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో రాజేశ్వర్, ఈవో వినోద్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కొమురయ్య పాల్గొన్నారు.



శ్రీనగర్‌కాలనీలో వరదకాల్వను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సమస్యలవాణి.. ఆలకించండి

- కలెక్టరేట్‌కు తరలివచ్చిన ప్రజలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- వివిధ సమస్యలపై 196 దరఖాస్తులు

సిరిసిల్లటౌన్: పెండింగ్‌లో ఉంటున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలువురు ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే అన్ని దరఖాస్తులు, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. సమస్య పరిష్కారం కాకుంటే ఎందుకు కాలేదో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా అందివ్వాలని సూచించారు.

కలెక్టర్‌కు 196 వినతులు

జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ కష్టాలపై 196 ఫిర్యాదులను కలెక్టర్‌కు అందజేశారు. రెవెన్యూ 95, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ 01, ఏడీ సర్వే 01, ఎడ్యుకేషన్ 07, ఉపాధి కల్పన 08, ఫారెస్ట్ 01, సివిల్ సప్లయ్ 01, డీఎంహెచ్‌వో 06, డీపీవో 07, డీఆర్‌డీవో 07, డీడబ్ల్యూవో 01, ఆర్‌టీసీ 01, ఎస్సీ కార్పొరేషన్ 02, మిషన్ భగీరథ 01, పంచాయతీరాజ్ 03, డబుల్‌బెడ్‌రూమ్ 01, సెస్ 12, వివిధ మండలాల ఎంపీడీవోలు 07, సిరిసిల్ల మున్సిపల్ 19, వేములవాడ మున్సిపల్ 01, ఎస్‌డీసీ 07, పోలీస్ 06 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

పట్టా రాలే..ప్యాకేజీ ఇవ్వలే



మాది వేములవాడ మండలం చింతల్‌ఠాణా. మా భూమి, ఇల్లు మిడ్‌మానేరులో ముంపునకు గురైంది. ఇప్పటికీ ప్యాకేజీ రాలేదు. ప్రభుత్వం కేటాయించిన భూమికి పట్టా ఇవ్వలేదు. నిబంధనల ప్రకారం నాకు పద్దెనిమిదేళ్లు నిండినయి. – చొక్కాల కరుణాకర్, చింతల్‌ఠాణా

గార్మెంట్ కార్మికులకు ఉపాధి కల్పించాలి



సిరిసిల్లలోని గార్మెంట్స్ కార్మికులకు ఉపాధి కల్పించాలి. గతంలో 30 వరకు గార్మెంట్ పరిశ్రమలు నడువగా ఇప్పుడు సగానికిపైగా మూతబడ్డాయి. కార్మికులు రోడ్డున పడ్డారు.

– జిల్లా గార్మెంట్స్ యూనియన్ నాయకులు

లిస్టులో పేరున్నా ఇల్లు ఇవ్వలేదు



చాలా రోజులుగా నా భర్త అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మేము సిరిసిల్ల సుభాష్‌నగర్‌లో అద్దెకుంటున్నాం. డబుల్ బెడ్‌రూం ఇళ్ల జాబితాలో పేరు వచ్చింది. కానీ డ్రాలో పేరు రాలేదు. మాకు ఇల్లు ఇప్పించండి. – నల్ల భాగ్యలక్ష్మి, శివదాస్

సమస్యలు పరిష్కరించండి



మా కాలనీలో వసతుల్లేవు. బోర్లు పాడై నీరు రావడం లేదు. విద్యార్థులు, పనుల నిమిత్తం సిరిసిల్ల తదితర ప్రాంతాలకు వెళ్లే వారికి బస్సు సౌకర్యం కల్పించాలి. కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలి.

– పెద్దూర్ డబుల్‌బెడ్‌రూమ్ కాలనీవాసులు

ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి



అనుమతి లేని పాఠశాలలు, అధిక ఫీజులు వసూళ్లకు పాల్పడున్న విద్యాసంస్థల యజమానులపై చర్యలు తీసుకోవాలి. మధ్యాహ్నం భోజన పథకంలో నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలి. – బీఆర్‌ఎస్వీ నాయకులు

కుక్కలు బాబోయ్



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ వేములవాడకు చెందిన గోలి స్వాతి. ఈనెల 27వ తేదీ సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటున్న తన కుమారుడు శరశ్చంద్రపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడ్డ బాలుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చింది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ట్రాఫిక్ పోలీసు పేరు బాబాయ్. రాజన్న ఆలయం వద్ద విధులు నిర్వహిస్తుంటారు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా కుక్కలు దాడి చేశాయి.

- ఇటీవల పెరిగిన దాడులు
- భయాందోళనలో జనం
- ఒంటరిగా వెళ్లేందుకు జంకుతున్న ప్రజలు
- రక్షణ కల్పించాలంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

వేములవాడ: కుక్కలు రెచ్చిపోతున్నాయి. కుక్కల దాడితో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారులు.. విధుల్లో ఉంటున్న ఉద్యోగులు.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే భక్తులు.. ఇలా ఇటీవల కుక్కలు దాడులు పెరిగిపోయాయి. ఇటీవల వేములవాడ మున్సిపల్ పరిధిలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. వీధుల్లో ఎక్కడ చూసినా గుంపులు..గుంపులుగా కనిపిస్తున్నాయి. కుక్కల గుంపును చూసి అటువైపు వెళ్లేందుకు జనం సాహసం చేయడం లేదు.

కుక్కల దాడులు ఇలా..

ఏప్రిల్‌లో 16, మేలో 14, జూన్‌లో 14

ఎటు చూసినా కుక్కలే..

వేములవాడ పట్టణంలో ఎటు చూసినా కుక్కల గుంపులే కనిపిస్తున్నాయి. ఏ సమయంలో చూసిన రోడ్లపైన కుక్కలు గుంపులుగా సంచరిస్తూనే ఉన్నాయి. వీటిని చూసిన జనం భయపడిపోతున్నారు. కుక్కల నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో బంగ్లాపైకి చేరుకుని పెద్ద ఎత్తున కూతలు పెడుతూ రాత్రి వేళ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

అందుబాటులో మందులు

కుక్క కరిచిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. కుక్కకాటుకు ఆస్పత్రిలో మందులున్నాయి. పిచ్చికుక్కలు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలి. గత మూడు నెలల్లో 44 మందిని కరిచాయి. కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. – మహేశ్‌రావు, వేములవాడ ఏరియా ఆస్పత్రి, సూపరింటెండెంట్

కుక్కలను తరలిస్తాం

ఇటీవల కుక్కల సంఖ్య పెరిగినట్లు తెలిసింది. గతంలోనూ కుక్కలను దూరప్రాంతాలకు తరలించాం. ఉన్నతాధికారులతో చర్చించి మళ్లీ తరలించేందుకు నిర్ణయం తీసుకుంటాం. కుక్కలతో తమ సిబ్బంది సైతం భయపడిపోతున్నారు.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారులోని కూనారం రైల్వేగేటు సమీపంలో సోమవారం తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి, ముత్తారం మండలం ఓడేడ్‌కు చెందిన ఆకుల మొగిళి(49) ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య కారణాలతోనే బలవన్మరణానికి పాల్పడ్డాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. మృతుడి భార్య సమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

రాజన్న సన్నిధిలో ఒకరు..


విష్ణు మృతదేహం

సిరిసిల్లక్రైం/వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న సన్నిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన గూడూరి విష్ణు(36) సోమవారం ఆర్టీసీ బస్సులో వేములవాడ ఆలయానికి చేరుకున్నాడు. రాజన్న ఆలయ కట్టమీద వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి, అక్కడే మృతిచెందాడు. గమనించిన భక్తులు ఆలయ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. కానీ, బస్ టికెట్ చూసి, సిరిసిల్ల నుంచి వేములవాడ వచ్చినట్లు తెలియడంతో మృతుడి ఫొటోను సిరిసిల్ల సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో అతని పేరు విష్ణు అని, గతంలో సాంచాలు, ఆటో నడిపేవాడని సమాచారం అందింది. అతని తల్లిదండ్రులు చనిపోయారని, వివాహం జరిగినా, కుటుంబసభ్యులతో ఉండటం లేదని పోలీసులు తెలిపారు. మృతుడిపై ఓ హత్య కేసు ఉందని విశ్వసనీయవర్గాల సమాచారం.

రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు


మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రభుత్వానికి సీఎమ్మార్ అప్పగించకపోవడంతో జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లులో స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీం అధికారి అనిల్‌కుమార్ జగిత్యాల డీఎం హతీరాంతో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. మిల్లుతోపాటు ధాన్యం నిల్వలున్న గోదాములను తనిఖీ చేశారు. 2022–23 యాసంగిలో 73,579 క్వింటాళ్ల ధాన్యం తీసుకోగా 20,281 క్వింటాళ్లు మరాడించారని, 2023–24 వానాకాలంలో 42,570 క్వింటాళ్లు తీసుకొని, 9,531 క్వింటాళ్లు మరాడించినట్లు, 2023–24 యాసంగిలో 38,330 క్వింటాళ్లు తీసుకొని, 2,559 క్వింటాళ్లు మరాడించారని తెలిపారు. మొత్తం ధాన్యంలో 10,756 క్వింటాళ్ల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామన్నారు. కొంత ధాన్యం వర్షాల వల్ల చెడిపోయిందని మిల్లు యజమాని శ్రీనివాస్ చెప్పారన్నారు. తేడా వచ్చిన ధాన్యానికి సంబంధించి డబ్బులు చెల్లిస్తానని, మిగతా ధాన్యం సీఎమ్మార్ పెట్టేందుకు సెప్టెంబర్ వరకు గడువు ఉందని, ఆలోగా అప్పగిస్తానన్నారని పేర్కొన్నారు. జమ్మికుంట తహసీల్దార్ విజయ, డీటీసీఎస్ వసంతరావు, ఎఫ్‌ఐ వినోద్ కుమార్, జమ్మికుంట టౌన్ సీఐ రవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'ప్రైవేట్' చదువులందేనా?

- ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు ఉత్తమాటేనా?
- అధ్యయనం పూర్తయి పదేళ్లు గడిచినా ఫలితం లేదు
- విద్యాహక్కు చట్టం అమలైతే ఉమ్మడి జిల్లాలో 50 వేల మంది విద్యార్థులకు లబ్ధి



కరీంనగర్: పేద విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్ల కేటాయింపు, ప్రభుత్వమే ఖర్చులు భరించి, ఉచితంగా చదువు చెప్పించాలనే నిర్ణయం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇటీవల సుప్రీంకోర్టు రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయకపోవడం, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవడం వంటి విషయాలపై సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ టీచర్ పోస్టుల భర్తీ, విద్యాహక్కు చట్టం అమలు సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు సూచించిన అంశాల అమలుకు బడ్జెట్ కేటాయింపులు తదితరాలపై సంబంధిత అధికారులతో సమీక్షించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి, విద్యాహక్కు చట్టం అమలుపై సూచనలు, సలహాలు తీసుకునేందుకు సర్కారు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అయితే, ప్రభుత్వమే కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందిస్తుందని ఒకవైపు చెబుతూనే, మరోవైపు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామంటుండటం విద్యాహక్కు చట్టం అమలుపై గందరగోళానికి కారణమవుతోంది. ఈ విద్యాసంవత్సరమైనా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులు చదివేందుకు అవకాశం లభిస్తుందో లేదో వేచిచూడాలి.

2012లోనే నివేదిక..

విద్యాహక్కు చట్టంలో భాగంగా.. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలని పదేళ్ల క్రితమే సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. కానీ, ఇంతవరకు అది అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం 8 మందితో నియమించిన కమిటీ సీట్ల కేటాయింపుపై అధ్యయనం చేసి, 2012 మే నెలలోనే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దానిపై గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో వేలాది మంది పేద విద్యార్థులు ప్రైవేట్ చదువులకు దూరమయ్యారు.

ఫీజుల భారంతో మిన్నకున్న సర్కారు

సీట్ల కేటాయింపునకు ప్రైవేట్ యాజమాన్యాలు విముఖంగా ఉన్నాయి. ఒకవేళ పేద పిల్లలకు సీట్లు కేటాయించినా ఒలింపియాడ్, కాన్సెప్ట్, టెక్నో, ఇంటర్నేషనల్, ఈ–టెక్నో స్కూళ్ల పేరిట వసూలు చేస్తున్న వేలాది రూపాయల ఫీజులను ప్రభుత్వం చెల్లించలేని పరిస్థితి. అందుకే గతంలో పలు విద్యాసంస్థల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. కమిటీ అధ్యయనం తర్వాత చాలావరకు యాజమాన్యాలు కొంతమేర అంగీకారం తెలిపాయి. కానీ, కమిటీ ప్రభుత్వంపై ఏటా పడే పడే ఫీజుల భారాన్ని కూడా నివేదికలో పేర్కొంది. ఇది చూసి, సర్కారు మిన్నకుండిపోయింది.

1,300కు పైగా ప్రైవేట్ స్కూళ్లు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1,300కు పైగా ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 3 లక్షల మంది విద్యార్థులున్నారు. ఆయా విద్యాసంస్థల్లో 25 శాతం సీట్ల ప్రకారం.. 75 వేల మందికి ఉచితంగా ప్రైవేటు చదువులు చెప్పాలి. అయితే, ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకే చట్టం వర్తిస్తుందని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. మధ్యలో చేరే వారికి ప్రైవేట్ చదువులు చెప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. ఫలితంగా విద్యాశాఖ చట్టం అమలైతే 45 వేల నుంచి 50 వేల మందికి లబ్ధి చేకూరనుంది. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. సర్కారు స్కూళ్లలో చదివే విద్యార్థులు ప్రైవేటు బడులకు తరలితే.. ఎలా? అని ప్రభుత్వం చట్టం అమలుకు వెనకడుగు వేసిందని గతంలో విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

చట్టాన్ని అమలు చేయాలి



సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయకపోవడం విచారకరం. ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ము కాసేలా ప్రభుత్వాలు పని చేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్నట్లు మన దగ్గర కూడా చట్టాన్ని అమలు చేయాలి.

– కె.రాణాప్రతాప్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి

బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

- ఎస్సారెస్పీలోకి 0.2 టీఎంసీల వరద నీరు


ఎస్సారెస్పీలోకి వస్తున్న వరద

జగిత్యాల అగ్రికల్చర్: మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ఎత్తివేశారు. వాటిని జూలై 1 నుంచి అక్టోబర్ 28 వరకు నాలుగు నెలలపాటు తెరిచే ఉంచనున్నారు. దీంతో, బాబ్లీ ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో కురిసే వరద నీరు ఆగకుండా నేరుగా ఎస్సారెస్పీలోకి రానుంది. దీనివల్ల ఎస్సారెస్పీ నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం బాబ్లీ నుంచి 0.2 టీఎంసీల వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీ నీటి మట్టం 10.474 టీఎంసీలుగా ఉంది. కార్యక్రమంలో పోచంపాడు ఎస్సారెస్పీ అధికారులు శ్రీనివాస్ గుప్తా, చక్రపాణి, వంశీ, మహారాష్ట్ర అధికారి బన్సోడ్, సమన్వయకర్తలు వెంకటేశ్వర్లు, సతీశ్ పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో డాక్టర్స్, చార్టర్డ్ అకౌంటెంట్స్ డే


చైర్మన్ నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు, సీఏలు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో నేషనల్ డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంటెంట్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మనుషుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు, ఆర్థిక వ్యవస్థను కాపాడటంలో సీఏలలు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. కోవిడ్–19 సమయంలో వైద్యుల సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. పేదలకు వైద్యసేవలందిస్తూ సేవాభావం చాటాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పారమిత'లో వైద్యుల దినోత్సవం..


జ్ఞాపిక అందిస్తున్న చైర్మన్ ప్రసాదరావు

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల, మంకమ్మతోటలోని పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు పలువురు వైద్యులను సన్మానించారు. డాక్టర్లు దేవుళ్లతో సమానమని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. వైద్య శిబిరం నిర్వహించి, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. పాఠశాలల డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనుకర్ రావు, హన్మంతరావు, రమణ, ప్రసాద్, వినోద్ రావు, ప్రిన్సిపాల్ కవిత ప్రసాద్, గోపీకృష్ణ, నాగరాజు, రాము, సమత, నాజిష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత ఉద్రిక్తత అడ్డగింత


జేసీబీ ఎక్కి ఆందోళన చేస్తున్న వెంకటేశ్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణం కూల్చివేత ఉద్రిక్తతకు దారితీసింది. ఆక్రమణదారు క్రిమిసంహారమందు డబ్బాతో రెవెన్యూ అధికారులను అడ్డుకొని, ఆందోళన చేపట్టాడు. వివరాల్లోకి వెళ్తే.. నగునూరులోని సర్వే నంబర్ 471 పోచమ్మకుంట గుట్ట ప్రాంత ప్రభుత్వ స్థలంలో కొన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇటీవల వేముండ్ల వెంకటేశ్ ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా పంచాయతీ కార్యదర్శి మల్లయ్య పనులు నిలిపివేయించాడు. అయినా, ప్రహరీ నిర్మించాడన్న సమాచారంతో ఆర్‌ఐ రజనీకాంత్ సోమవారం మోకాపై వెళ్లి, పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన ప్రహరీని జేసీబీతో కూల్చివేయించేందుకు ప్రయత్నించగా వెంకటేశ్ క్రిమిసంహార మందు డబ్బాతో వచ్చి, అడ్డుకున్నాడు. మిగతా వారి ఇళ్లను కూల్చివేసిన తర్వాతే తన గోడను కూల్చాలన్నాడు. లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడు. కూల్చివేతకు వచ్చిన జేసీబీ పైకి ఎక్కి, ఆందోళన చేపట్టాడు. స్వచ్ఛందంగా ప్రహరీని తొలగించుకోవాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ హెచ్చరించి, వెనుదిరిగారు. అయితే, ఈ స్థలంలో స్థానిక ప్రజాప్రతినిధుల అండతోనే పలువురు అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. వాటిని తొలగించి, పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు.

ఆమె కళ్లు సజీవం


స్వరూప (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన ముక్క స్వరూప(60) సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతిచెందింది. కుటుంబసభ్యులకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అవగాహన కల్పించడంతో ఆమె కళ్లను దానం చేయడానికి ముందుకువచ్చారు. దీంతో సంస్థ జిల్లా అధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో టెక్నీషియన్ లక్ష్మణ్ సహకారంతో స్వరూప నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు పంపించారు. ఆమె భర్త కృష్ణమూర్తి, కుమారుడు–కోడలు శ్రావణ్‌కుమార్–శిరీషలకు ఫౌండేషన్ నిర్వాహకులు అభినందించారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్


సాంబశివరావు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాంబశివరావును సస్పెండ్ చేస్తూ మల్టీజోన్–1 ఇన్‌చార్జి ఐజీ సుధీర్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల సాంబశివరావుపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఎస్పీ అఖిల్ మహాజన్ దర్యాప్తు చేసి నివేదికను అందజేశారు. అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆర్టీసీ ఉద్యోగి ఇంట్లో డీఎం విందు?

- సోషల్ మీడియాలో వైరల్


వైరల్ అవుతున్న ఫొటో

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ సంస్థకు చెందిన ఓ ఉద్యోగి ఇంట్లో విందు చేసుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో మద్యం తాగడం వ్యక్తిగతమైన విషయమైనప్పటికీ ఉద్యోగుల ఇళ్లలో ఇలా చేయడం ఇబ్బందికరమని పలువురు పోస్టులు పెడుతున్నారు. దీనిపై డీఎంను వివరణ కోరగా గతేడాది జూలైలో ఉద్యోగి ఇంటికి తీజ్ ఉత్సవాలకు వెళ్లానని, ఎలాంటి మద్యం తీసుకోలేదని తెలిపారు. 10 నిమిషాలు మాత్రమే ఉండి వచ్చానని, ఎవరో కావాలనే ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

చొప్పదండిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

- 14 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష అపహరణ

చొప్పదండి: పట్టణంలోని తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై ఉపేంద్రచారి కథనం ప్రకారం.. చొప్పదండి వివేకానంద చౌరస్తా సమీపంలో ఉండే గుర్రం చంద్రకళ భర్త 16 ఏళ్ల క్రితం మృతిచెందాడు. ఇద్దరు కుమారులు అమెరికాలో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆమె గత నెల 26న శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుపతి వెళ్లింది. స్వామివారి దర్శనం అనంతరం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం ఆకెనపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. 30న మధ్యాహ్నం తన ఇంటి పక్కనున్న బంధువు వరలక్ష్మిని ఒకసారి ఇంటికి వెళ్లి, చూడాలని కోరింది. ఆమె వెళ్లి పరిశీలించగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. విషయాన్ని చంద్రకళకు చెప్పడంతో సోమవారం ఇంటికి వచ్చింది. లోపలికి వెళ్లి చూడగా రెండు బీరువాలు ధ్వంసమై, సామగ్రి చిందరవందరగా పడి ఉంది. 14 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష, రెండు ఐప్యాడ్ చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొత్త చట్టాలు.. తొలిరోజు ఐదు కేసులు

- జగిత్యాల, సిరిసిల్లలో రెండు చొప్పున..
- కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో ఒకటి నమోదు

జగిత్యాల క్రైం: కేంద్రం ప్రభుత్వం న్యాయశాఖలో కొత్తగా తీసుకొచ్చిన చట్టాల్లో భాగంగా తొలిరోజు జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు రెండు కేసులు నమోదయ్యాయి. చెర్లపల్లికి చెందిన ఆది గంగారెడ్డి తన వ్యవసాయ భూమిలోకి నీరు వదలిపెట్టాలని దీటి లావణ్యపై ఫిర్యాదు చేశాడు. దీనిపై తొలి కేసు నమోదైంది. అలాగే, దీటి గంగారెడ్డి తనను అసభ్యపదజాలంతో దూషిస్తూ, బెదిరించాడని దీటి లావణ్య ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై..

కరీంనగర్ క్రైం: మానకొండూర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కొత్తగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూ టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. మానేరు వాగు నుంచి ట్రాక్టర్‌లో కరీంనగర్‌లోని ముకరంపురకు ఇసుక తరలిస్తుండగా తెలంగాణ చౌక్ వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిపై..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని రాళ్లపేటకు చెందిన సోమ లక్ష్మి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన గణాది దేవేందర్‌పై గతంలో కేసు నమోదైంది. రిమాండ్ అనంతరం ఇంటికి వచ్చిన అతను లక్ష్మిని బెదిరిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తండ్రిపై తనయుడి దాడి..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భారత న్యాయ సంహితలో భాగంగా ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో తొలి కేసు నమోదైంది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పదిరకు చెందిన సూరం నర్సయ్య కూలి పనులు చేస్తూ జీవిస్తుండగా, అతని కొడుకు శ్రీనివాస్ జులాయిగా తిరుగుతున్నాడు. సోమవారం పనికి వెళ్లొచ్చిన తండ్రిని కొడుకు డబ్బులు ఇవ్వాలంటూ బెదిరించాడు. ఇవ్వకపోవడంతో కోపోద్రిక్తుడైన శ్రీనివాస్ తన తండ్రిపై కర్రతో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కొత్త చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

మెట్‌పల్లి(కోరుట్ల): ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాలిక ఏడాది క్రితం హైదరాబాద్‌లో ఉండగా నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని బచ్చన్‌పల్లికి చెందిన పృథ్వీ రాజ్‌తో పరిచయం ఏర్పడింది. తర్వాత ప్రేమిస్తున్నానని చెప్పి, పెళ్లి చేసుకుందామని అతను అడగగా.. అంగీకరించలేదు. ఆమె తల్లి వద్దకు వెళ్లి విషయం చెప్పగా.. ఒప్పుకోలేదు. దీంతో బాలికను బలవంతంగా బచ్చన్‌పల్లిలోని తన ఇంటికి తీసుకెళ్లి, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఓ ఆలయంలో పెళ్లి చేసుకొని, తీవ్రంగా వేధించాడు. దీంతో ఆమె పారిపోయి తల్లి వద్దకు వచ్చింది. అయినా, తరచూ ఫోన్ చేస్తూ బెదిరింపులకు గురిచేస్తుండటంతో గత మే 31న పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. అప్పటినుంచి పరారీలో ఉన్న పృథ్వీరాజ్‌ను సోమవారం ఇబ్రహీంపట్నంలో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రంగపేట హైస్కూల్లో దొంగతనం


పాఠశాలలో పగులగొట్టిన కోడిగుడ్లు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని రంగపేట ఉన్నత పాఠశాలలో దొంగలు పడ్డారని గ్రామస్తులు తెలిపారు. స్కూల్లో ఏర్పాటు చేసిన లైట్లు, మైక్ సెట్‌ను చోరీ చేశారన్నారు. వారి వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి దొంగలు పాఠశాలలోకి ప్రవేశించిన దొంగలు వరండాలో మద్యం సేవించారు. సీసాలను, స్కూల్ ఆవరణలో గల అంగన్‌వాడీ కేంద్రంలోని కోడిగుడ్లను పగులగొట్టారు. రూ.30 వేల విలువైన సోలార్ లైట్లు, స్కూల్ గది తలుపులు పగులగొట్టి, మైక్ సెట్‌ను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం పాఠశాలను శుభ్రం చేయడానికి వచ్చిన సిబ్బంది ఈ విషయమై గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్కూల్‌కు చేరుకొని, విచారణ చేపట్టారు. అధికారులు స్పందించి, పాఠశాల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనారోగ్య కారణాలతో మహిళ బలవన్మరణం

చొప్పదండి: అనారోగ్య కారణాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉపేంద్రచారి కథనం ప్రకారం.. చొప్పదండి మండలంలోని రుక్మాపూర్‌కు చెందిన పెంటల రాజమ్మ(55) భర్త నుంచి విడిపోయింది. కూలీ పని చేసుకుంటూ జీవిస్తోంది. రెండేళ్ల క్రితం చొప్పదండిలోని పాత వెదురుగట్ట రోడ్డులో గల దుబ్బల మీద ఇందిరమ్మ కాలనీ వద్ద ఇల్లు నిర్మించుకుంది. ఆమెకు ఒక కూతురు కాగా, వివాహం జరిపించింది. ఈ క్రమంలో రాజమ్మ 2 నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆమె కూతురు పలు ఆస్పత్రులకు తీసుకెళ్లి, చికిత్స చేయించినా నయం కాలేదు. గత 30న తల్లిని ఇంట్లో దింపి, వెళ్లిపోయింది. సోమవారం ఉదయం రాజమ్మ కనిపించకపోవడంతో స్థానికులు ఆమె కూతురుకు సమాచారం అందించారు. సమీపంలో వెతకగా, వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. మృతురాలి కూతురు న్యాతరి వనజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరీంపేటలో యువకుడు..


సాయిరాం (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కరీంపేటకు చెందిన గుర్రం సాయిరాం (22) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి, గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గుర్రం నాగరాజు–భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కొడుకు సాయిరాం స్నేహితులతో కలిసి లఘుచిత్రాల్లో నటించేవాడు. కొంతకాలంగా కరీంనగర్‌లోని వైన్స్‌లో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం ఓ మహిళతో సహజీవనం చేసినట్లు తెలిసింది. ఆదివారం రాత్రి వరకు వైన్స్‌లో పనిచేసిన అతను సోమవారం తెల్లవారు జామున కరీంపేటలోని ఇంటికి వచ్చి, క్రిమిసంహారక మందు తాగి, మృతిచెందాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీడీనగర్‌లో వృద్ధుడు..

పాలకుర్తి(రామగుండం): మండలంలోని జీడీనగర్‌కు చెందిన గోల్కొండ ఎల్లయ్య(77) ఆత్మహత్య చేసుకున్నాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి వివరాల ప్రకారం.. ఎల్లయ్య మద్యానికి బానిసయ్యాడు. సోమవారం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన ఆయనను కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై, తాడు తీసుకొని, బయటకు వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని పల్లె ప్రకృతి వనం సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. స్థానికులు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో మృతుడి కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎములాడ రాజన్నకు పోటెత్తిన భక్తులు


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్నను సోమవారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈనెల 5 నుంచి అమావాస్య, ఆషాఢమాసం ఆరంభమవుతుండడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు బి.శ్రీనివాస్, ప్రతాప నవీన్ పరిశీలించారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

- స్కూల్‌కు బైక్ తీసుకెళ్లనివ్వడం లేదని ఆత్మహత్యాయత్నం


మణిదీప్ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని పోసానిపేటకు చెందిన మారు మణిదీప్(14) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై నవీ న్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మారు రాజ్‌కుమార్–లావణ్య దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కొడుకు మణిదీప్ కోరుట్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. స్కూల్‌కు బైక్ తీసుకెళ్తానంటే తల్లి అంగీకరించలేదు. దీంతో మనస్తాపానికి గురై, గత నెల 24న క్రిమిసంహారక మందు తాగాడు. ఈ విషయాన్ని 27న తల్లిదండ్రులకు చెప్పాడు. వారు మణిదీప్‌ను జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.